
# సత్తెకాలం బావ




సాయంత్రం ఐదవుతుంది

చిన్న చేతి సంచితో గుమ్మం ముందు రిక్షా దిగుతున్న మేనత్త కొడుకుని చూసి ఆశ్చర్యపోయింది సుమిత్ర.

గబగబా ఎదురెళ్ళి "ఏంటి బావా ఇలా వచ్చావ్? దారి గాని తప్పావా ఏం? చాలా కాలానికి జ్ఞాపకం వచ్చానే. మనం కల్సుకుని శాన ఏళ్ళయిపోలే? అయితే నేనింకా నీకు జ్ఞాపకం ఉన్నానన్నమాట" అంది.

"ఎంత మాట సుమిత్ర నిన్ను మర్చిపోవటం ఏమిటి? అలా అని అస్తమానం వస్తే బాగుంటుందా చెప్పు"

"ఎందుకు బాగుండదు? నువ్వు వస్తే ఇక్కడ నిన్ను తప్పులు పట్టి వెలివేసే వాళ్ళు అంతటి కుసంస్కార వంతులు ఎవ్వరూ లేరు. నీకు నన్ను చూడాలనిపించక రావటం లేదు. అంతే" అంది చల్లటి నీళ్ళ గ్లాసు అందిస్తూ.

రాఘవ నవ్వాడు.

"నా మనసేమిటో నీకు తెలుసు" అన్నాడు.

ఒక్క క్షణం అలా అతని కేసి చూసి చూపు మరల్చుకుంటు సుమిత్ర.

పుట్టినప్పట్నుంచి సుమిత్ర రాఘవ పెళ్ళాంగానే పెరిగింది కాని అదృష్టం వరించి రాఘవకి పెద్ద ఉద్యోగం వచ్చింది. పెళ్ళి కొడుకుల మార్కెట్లో అతని రేటు విపరీతంగా పెరిగిపోయింది. దాంతో సుమిత్ర మేనత్త, రాఘవ తల్లి డబ్బు మాయలో పడిపోయింది. సుమిత్ర తండ్రి స్వంత అన్న అయిన సాంబయ్యాని ఎక్కువ కట్నం కోరింది. నల్గురు ఆడ పిల్లల తండ్రి సాంబయ్య. సుమిత్ర పెద్ద కూతురు ఉన్నదంతా ఒక్క ఆడపిల్ల పెళ్ళికే ఉడ్చేస్తే మిగత వాళ్ళ మాట ఏమిటి? ఇద్దరు కొడుకులకి కనీసం చదువన్న చెప్పించాలి కదా?

అందుకే చిన్నప్పట్నుంచి అనుకున్న మేనరికం వదులుకుని కంతకి తగ్గ..... అన్నట్లు తన శక్తికి తగిన సంబంధం సుమిత్రకి తెచ్చాడు.

రాఘవ మనసంతా సుమిత్ర మీదే ఉంది.

సుమిత్ర మనసంతా రాఘవ మీదే ఉంది.

అయినా చెయ్యగలిగింది ఏమీ లేదు. పరిస్థితులు అలా ఉన్నాయి. తల్లిని ఎదిరించలేక పోయాడు రాఘవ.

తల్లి నిర్ణయించిన శ్రీలక్ష్మి మెళ్ళో తాళి కట్టాడు. అదంతా గతం. ఇరవై ఏళ్ళు పైగా గడిచిపొయ్యాయి.

సుమిత్ర భర్త రాజశేఖర్ టీచరు నుంచి లెక్చరర్ స్థాయికి ఎదిగాడు. ఒక కొడుకుతో సరిపెట్టుకున్నారు. ట్యూటోరియల్స్ పెట్టి బాగా సంపాదించాడు రాజశేఖర్. గవర్నమెంటు కాలేజి లెక్చరర్.

అనుకోకుండా రాఘవ ఆర్థిక పరిస్థితి దెబ్బతింది. తల్లి తండ్రి మొండి రోగాలతో దీర్ఘ కాలం మంచం పట్టారు. వేలాది రూపాయిలు వైద్యానికి ఖర్చు అయ్యాయి. పైగా చెల్లెళ్ళ సంసారాలు బాగుండక పోవటంతో ఆర్థికంగా చికాకులు ఎక్కువయ్యాయి. ఉన్న ఇల్లు అమ్మాల్సి వచ్చింది. ఆదాయం మించి అప్పులు పేరుకున్నాయి. ట్యూషన్ లేకుండా కొడుకు కష్టపడి చదువుకుని మెడిసన్‌లో సీటు సంపాదించుకున్నాడు. కానీ డొనేషన్ కట్టాల్సి వచ్చింది. రాఘవ దగ్గర డబ్బు లేదు. చేసిన అప్పులే తీర్చలేక పోతున్నాడు. అలాగని ఎంతో ఆశతో డాక్టరు కావాలనుకుంటున్న కొడుకు భవిష్యత్తు నాశనం చెయ్యగలడా?

ఈ పరిస్థితిలో విధిలేక డబ్బు కోసం సుమిత్ర దగ్గరకి వచ్చాడు.

దానికి కారణం సుమిత్ర భర్త రాజశేఖర్ ఉన్నత విద్యావంతుడే కాదు సంస్కార వంతుడు కూడా అందుకే అతని సహాయం కోసం వచ్చాడు. తన భార్య సుమిత్రకి చిన్నప్పట్నుంచి బావ రాఘవతో అనుకున్న సంబంధం అని, కానీ కట్నం కారణంగా వారి పెళ్ళి జరగలేదని అతనికి తెలుసు. అయినా పెద్దగా పట్టించుకోలేదు. రాఘవతో స్నేహంగా ఉంటాడు.

రాఘవ వచ్చిన పని విని సుమిత్ర నొచ్చుకుంది.

"అయ్యో, డబ్బు అవసరం పడి వచ్చావా? ఆయన దగ్గర లేకపోలేదు బావా. ఆయన పేర్న

బ్యాంకులో అకౌంటు ఉంది. కాని ఆయన ఊళ్ళో లేరు పిల్లల్తో బొటానికల్ టూర్ వెళ్ళారు. వారం రోజుల దాకా రారు బావా'' అంది.

"అలాగా నాకు చాలా అవసరంగా డబ్బు కావాలి. మా అబ్బాయికి మెడికల్ సీటు వచ్చింది. ర్యాంకు బాగుంది కాని కొద్దిగా డొనేషన్ కూడా కట్టాల్సి వస్తుంది నా దగ్గర వున్నది సరిపోదు. అందుకని......''

"ఎంత కావల్సినా సందేహ పడకు. ఆయన తప్పక సర్దుబాటు చేస్తారులే బావ. చదువు విషయం అంటే ఆయన అస్సలు కాదనరు. తప్పకుండా సహాయం చేస్తారు. ఇంకా టైముందిగా దిగులు పడకు'' అంది.

అప్పటికే బాగా చీకటి పడింది

ఇల్లంత లైట్లు వేసి వంట గదిలోకి వచ్చింది. గడప దగ్గర కుర్చి వేసింది. రాఘవ కుర్చీలో కూర్చున్నాడు. అతనితో సరదాగా కబుర్లు చెపుతూ వంట పూర్తి చేసింది వేడిగా వడ్డించింది.

భోజనం చేసి మళ్ళీ తన సంచీ తీసుకుని తిరుగు ప్రయాణం అయ్యాడు రాఘవ.

"అదేమిటి బావా అప్పుడే వెళుతున్నావ్? ఆయన వచ్చే దాకా వుండవా?'' అంది విస్తుపోతున్నట్లు.

"ఎలా కుదురుతుంది సుమిత్ర. రాజశేఖర్ ఎప్పుడు వస్తాడో తెలియదుకదా. మళ్ళీ వస్తాలే. ఈలోగా నువ్వు నే వచ్చిన విషయం చెప్పు. సర్దుబాటు అవుతుంది అంటే మళ్లీ వస్తాను'' అన్నాడు.

"సరే, అంతవరకు నా అకౌంటులో కాస్త ఉంది. రేపు బ్యాంకు తెరిచాక తెచ్చి ఇస్తాను. రాత్రికి వుండి రేపు వెళుదువుగాని. ఆయన వచ్చాక మిగతాది తప్పకుండా సద్దుబాటు చేస్తాం. ఎవో ఫిక్సిడ్ డిపాజిట్లు ఉన్నాయిలే. అవి క్యాన్సిల్ చేసి అయినా ఇస్తారు. అవసరానికి ఆదుకోవటానికే కదా డబ్బు జమ చేసేది'' అంది.

"......'' బిత్తర పోతూ చూశాడు రాఘవ.

"ఏంటి బావా అంత ఆలోచన. రాత్రికి వుండి రేపు వెళ్ళు బ్యాంకు తెరిచాకా డబ్బు తేవాలి కదా?''

రాఘవ ఖంగారుగా చూశాడు.

"రాత్రికి ఎందుకులే సుమిత్ర. నన్ను వెళ్ళని. మళ్ళీ వస్తాగా. డబ్బు ఒకేసారి మీ ఆయన వచ్చాక తీసుకుంటా'' అంటూ చెప్పులు తొడుక్కుని సంచి చేతికి తగిలించుకున్నాడు.

సుమిత్ర కోపంగా చూసింది. వేగంగా అడుగులు వేసి వీధి గడప దాటుతున్న అతని చేతిని పట్టుకుంది.

"రాత్రికి రాత్రి ఇలా వచ్చి అలా వెళ్ళిపోతావా? అంత పరాయి వాళ్ళమా బావా మేం?'' సుమిత్ర కళ్ళ నిండా నీళ్ళు వచ్చాయి. చలించినట్లు చూశాడు రాఘవ.

"ఛ.... అలా అని కాదు సుమిత్ర. మీ వారు లేకుండా నేను వుండటం.... అంత.... మం......''

"మా అబ్బాయి ఉన్నాడుగా''

"వాడి వయస్సు ఎంత? పధ్నాలుగు. అయినా ఎందుకు సుమిత్ర లేనిపోని సమస్యలు సృష్టించుకోవటం. నా మాట విను.''

అతని మనస్సులోని భయం అర్ధం అయిన సుమిత్ర కుండబద్దలు అయినట్లు ఒక్కసారి విరగబడి నవ్వింది అలా ప్రవాహంలా నవ్వుతూనే అంది.

"బావా బావా అదానీ భయం. నిజంగా నువ్వు పిరికి వాడివి బావా. నిజంగా నీకు నా మీద అంత కోరికే వుంటే ఆనాడు అత్తయ్యనే ఎదిరించి వుండేవాడివి. కానీ ఆ పని నువ్వు చెయ్యలేదు. ఇప్పుడు ఇరవై సంవత్సరాలు గడిచాయి. ఈ వయసులో నువ్వు లోకానికి భయపడుతున్నావా? నిజంగా నువ్వు సత్తెకాలం వాడివి బావా. మన మనసు ప్రక్షాళనగా వుంటే ఎవ్వరికి భయపడ నక్కర్లేదు బావా. మేనత్త మేనమామ పిల్లలం గనక మన పెళ్ళి గురించి ఆరోజుల్లో పెద్దలు అనుకో వచ్చు. కుదరలేదు. అంతమాత్రాన మళ్ళీ మనం కల్సుకోవటం ఆపేక్షగా మాట్లాడుకోవటమే అప విత్రం అయిపోతుందా? మా వారికి చదువుతో పాటు బోల్డంత. సంస్కారం కూడా ఉంది బావా. అంతకంటే ఎక్కువగా నా మీద మా ఆయనకి నమ్మకం వుంది బావా... భార్యా భర్తల మధ్య వుండ వలసింది నమ్మకం. నువ్వు లోకం గురించి మా వారి గురించి భయ పడేటట్లు అయితే వెళ్ళు. రాత్రికి ఉండకు. లేదూ నీ గురించి నీకేమన్నా భయం వుంటే, లేక నా ప్రవర్తన మీద నమ్మకం లేకపోయినా కూడా వెళ్ళిపో. అలా కాక నీ మీద నాకు నమ్మకం వుంటే గనక, రాత్రికి వుండి రేపు నేను ఇచ్చే డబ్బు తీసుకుని వెళ్ళు. ఏకాంతం దొరికితే తొందరపడి చలించిపోయే టంతటి అల్ప వ్యక్తిత్వంలో మన పెద్ద వాళ్ళు మనల్ని పెంచలేదు బావా? సంప్రదాయం కట్టు బాట్లతో పెంచారు. అందుకే ఆరోజు అత్తయ్య వద్దంటే నువ్వు, నేను విలువ ఇచ్చాంగాని, పెద్దల్ని ఎదిరించి పెళ్ళి చేసుకోగలిగామా? మనిద్దరం పెళ్ళి అయి సంసారాలతో బాధ్యతలతో ఉన్న వాళ్ళం. పైగా ఇరవై ఏళ్ళు గడిచిపోయింది. ఇంకా ఈ వయసులో అంత చెత్తగా వుంటామని ఎవరన్నా ఎలా అనుకుంటారా బావా? పైగా నా భర్త నన్ను పువ్వొ పువ్వొ అన్నంత ప్రేమగా అపురూపంగా చూసుకుంటున్నాడు అంతటి ప్రేమని వంచించి క్షణికావేశానికి వశం అవుతానని ఎలా అనుకున్నావ్ బావ నన్ను?'' సుమిత్ర కళ్ళు ఎర్రబడ్డాయి ఆవే శంతో అధరాలు ఒణకసాగాయి.

'ఛ....ఛ.... అలా అని కాదు సుమిత్ర' ఖంగా రుగా చేతిని ముందుకి చాచి అరచేతిని అటూ ఇటూ కదిలించాడు రాఘవ.

అతని ముఖంలోని అమాయకతకి ఖంగారుకి సుమిత్ర ముఖంలో కోపం పటాపంచలు అయ్యింది. మళ్ళీ కొండ పగిలినట్లు విరగబడి నవ్వింది. అలా ప్రవాహంలా నవ్వుతోనే అంది.

"అలాంటప్పుడు రాత్రికి వుండి రేపు వెళ్ళ మంటే మా ఆయన ఇంట లేడని ఎందుకు భయ పడుతున్నావ్ రాకరాక ఇన్నాళ్ళకి వచ్చావ్. అదీ అవసరంపడి వచ్చావ్. ఆయన ఉళ్ళో లేనంత మాత్రాన భయపడాల్సిన అవసరం ఏమిటి? మనం భయపడటానికి ఇందులో అసలు తప్పేముంది? సరదాగా కబుర్లు చెప్పుకుందాం. రాత్రికి వుండి రేపు బ్యాంకు పని చూసుకుని వెళ్ళు.'' అంటు చొరవగా అతని చేతిలో సంచిని లాక్కుంది సుమిత్ర.

"రాజశేఖర్ ఏమి అనుకో......''

"అదిగో.... మళ్ళీ అదే మాట అసలు ఇందులో తప్పేముంది బావ ఆయనన్నా, ఇంకెవరన్నా, ఏమన్నా, అనుకోవటానికి, నీ చాదస్తం గాని....'' అంటు రాఘవ్ చేతిలోంచి బ్యాగు గుంజుకుని బీరువా మీదికి గిరాటేసింది. రాఘవ కూడా ధైర్యంగా ఆమె ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. చెప్పులు విడిచి బల్లకిందకి తోశాడు.

"అలా అనుకుంటే ఇంత పెంద్రాళే అన్నం తినక పోదును'' అన్నాడు.

"ఇప్పుడేం పోయింది. మా అబ్బాయి ట్యూషన్ నుంచి వచ్చాక కావాలంటే వాడితో కల్సి మళ్ళీ తిందువుగానిలే.... తప్పేం లేదు'' అంది సుమిత్ర.❋

